శ్రీ చంద్రఫామ్స్ & రిసార్ట్స్ ఇండియా లిమిటెడ్ – నవ్య వీక్లి కథల పోటీలో

## విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ

"నాన్నా! ఒక్కసారి ఇవి తిని చూడండి! మొన్ననే మార్కెట్లోకి వచ్చాయి. ఒక్కసారి తింటే వదల్లేరు! అమ్మా! నువ్వు కూడా! ఇవి మరీ అంత స్వీట్‌గా ఏం లేవులే!" సిటీ నుండి తెచ్చిన కొత్తరకం బిస్కట్ ప్యాకెట్‌ను విప్పి ప్లేట్లో వేసింది లావణ్య!

"ఏవండీ! దీనికింకా చిన్నతనం పోనేలేదు! ఎప్పుడు వచ్చినా సంచీ నిండా బిస్కట్లు. చాక్లెట్లూ నింపుకొని వస్తుంది! ఇక్కడెవరో చిన్నపిల్లలున్నట్లు!" చిరుకోపంతో అంది సుశీల.

"నీ కంటికి కనిపించరేమో గానీ, ఇక్కడ నాలాంటి చిన్న పిల్లలున్నారని, వారికి బిస్కట్లూ, చాక్లెట్లూ బాగా ఇష్టమని దానికి తెలుసులేవోయ్! అది మా అమ్మకదా! అందుకే నా కోసం తీసుకు వస్తుంది ఇవన్నీ!" లావణ్య తన తల్లి పోలికలతో పుట్టిందని శివప్రసాద్‌కి మరీ గారాబం కూతురంటే!

# మళ్ళీ కురిసేదాకా!

బి. మురళీధర



"సరేలెండి! సంబడం! మా అమ్మ కదా, మా అమ్మ కదా అనుకుంటూ వుండండి! దానికి నిజంగానే మీ అమ్మ వయసు వచ్చేస్తుంది! అప్పుడు చేద్దురుగానీ పెళ్ళి! ముందు పెళ్ళి విషయం..." తల్లిని మధ్యలోనే ఆపేసింది లావణ్య.

"అమ్మా! ఏ విషయం మాట్లాడినా చివరికి పెళ్ళిదాకా తెస్తావు! బిస్కట్ల నుండి మొదలు పెట్టి పెళ్ళిదాకా వచ్చేశావు. నువ్వెప్పుడూ ఇంతే! నాన్నగారి హ్యాపీ మూడ్‌ని చెడగొడ్తావు!" నిష్ఠూరంగా అంది లావణ్య.

"నీకేం తెలుస్తుందమ్మా నా బాధ! ఏ వయసులో జరగాల్సింది ఆ వయసులో జరిగితేనే మంచిది!" కొంత బాధగా అంది సుశీల.

లావణ్యకు సంబంధం కుదరడం లేదని, చాలాకాలంగా లోలోపల బాధ పడ్తున్నారు. శివప్రసాద్‌కు ఒక కొడుకూ, ఒక కూతురు మాత్రమే కావడం, చేసేది చిరుద్యోగమైనా, క్రమశిక్షణ గల జీవనశైలిని అలవర్చుకోవడం వలన ఇద్దరినీ మంచి చదువులు చదివించగలిగాడు. ఫలితంగా ఇద్దరు పిల్లలూ సాఫ్ట్ ఇంజనీర్లుగా ఎదిగి, బాగా సంపాదిస్తున్నారు. కొడుకు కార్తీక్ కంపెనీ తరఫున స్టేట్స్‌వెళ్తే, కూతురు లావణ్య సిటీలోనే ఓ మంచి కంపెనీలో పని చేస్తోంది. నెలకోసారి తల్లిదండ్రుల దగ్గరికి వచ్చి పోతూ వుంటుంది.

మొన్నటిదాకా పెద్ద సమస్యేమీ కాదనుకున్న లావణ్య పెళ్ళి ఇటీవల నిజంగానే పెద్ద సమస్యగా అనిపిస్తోంది. అందమూ, చదువూ, మంచి ఉద్యోగమూ ఉన్న లావణ్యకి తగిన వరుడు దొరకక పోవడమే అసలు సమస్య. ముప్ఫయి ఏళ్ళకే ముసలైపోతున్న యువతరాన్ని చూస్తే శివప్రసాద్‌కి ఆశ్చర్యం వేస్తోంది. సాఫ్ట్‌వేర్ జీతాలతో జీవన విలువలు పెరగడం మాట ఎట్లున్నా, వారి శరీర బరువులూ, కొలతలు బాగా పెరిగిపోయిన మాట మాత్రం వాస్తవం.

దీపావళి పండుగకి మూడు రోజులు సెలవులు కలిసి రావడంతో, మరో మూడు రోజులు సెలవుపెట్టి, వారం రోజులు సొంత వూళ్ళో తల్లిదండ్రులతో గడుపుదామని వచ్చింది లావణ్య. గత నెల రోజులుగా ఈ వారం రోజుల కోసం ఎదురు చూస్తోంది.

మధ్యాహ్న సమయంలో ఇంటి ముందుకి వ్యాన్ వచ్చి ఆగింది. వ్యాన్ చప్పుడు వినగానే హాల్లో వున్న లావణ్య బయటకు వచ్చింది. డ్రైవర్‌ను గుర్తు పట్టింది.

"ఆ! ఆ! రండి! రండి! ఇదే ఇల్లు! ఇక్కడే దించాలి. మనుషులుకూడా వచ్చారా?" లావణ్య అడుగుతోంది డ్రైవర్‌ని.

"ఆ! వొచ్చారమ్మా! సామాను దించేయమంటారా!" వంటింట్లో పని చేసుకుంటున్న సుశీల హడావుడి

విని బయటకు వచ్చింది.

"ఒక్క అయిదు నిమిషాలాగండి! అమ్మా! కొంచెం ఆ వచ్చిన మనుషులకు టీ పెట్టిస్తావా!" అంటూ అమ్మ అయోమయ ముఖారవింద సౌందర్యాన్ని ఎంజాయ్ చేస్తూ లోపలికి పరిగెత్తింది లావణ్య.

"ఏం సామానుంది బాబూ లోపల!" కుతూహలంగా డ్రైవర్‌ను అడిగింది సుశీల.

"ఏమో అమ్మగారూ! అన్నీ అట్టపెట్టెల్లో ప్యాక్ చేసి వున్నాయి. విప్పితే గాని తెలీదు!"

లావణ్య నాన్నని పిలిచి ఏదేదో పురమాయిస్తోంది. ఈలోగా వచ్చిన మనుషులు ఒకొక్క పెట్టెను జాగ్రత్తగా దించి వరండాలోకి చేరుస్తున్నారు.

"వణీ! ఏమిటే ఇవన్నీ!" సుశీల అడిగినా లావణ్య నవ్వుతోందే తప్ప పెదవి విప్పడం లేదు! శివప్రసాద్ ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడు. తల్లిని సస్పెన్సులో పెట్టి ఎంజాయ్ చెయ్యడం లావణ్యకు చిన్నప్పట్నుంచీ సరదా! సుశీల తండ్రీ కూతుళ్ళపై అలిగి చిరుకోపంతో లోపలికి వెళ్ళిపోయింది.

తల్లి అలక అర్థమైన లావణ్య తను ఏమేం తెచ్చిందో వివరంగా చెప్పడానికి ఆమె వెనుకే వెళ్ళింది.

అమ్మ మాత్రం 'ఇప్పుడవన్నీ ఎందుకు! ముందు ఆడపిల్ల పెళ్ళయిపోవాలి! తర్వాత చూసుకోవచ్చు!' అంటుంది. ఇటీవల నాన్నగారికి బ్యాక్‌పెయిన్ మరీ ఎక్కువైంది. అమ్మకి ఒళ్ళునొప్పులూ మోకాళ్ళ నొప్పులూ మొదలయ్యాయి.

కష్టాలని ఓర్చుకునే వయసులో శక్తికి మించి ఓర్చుకున్నారు. ఇక సుఖపడే వయసులోనైనా, వాళ్ళని అన్నిరకాలుగా సంతోషంగా, సుఖంగా ఉంచాలని, లావణ్య ఆరాటం. ఆ ఆరాటంతోనే సిటీ నుండి ఒక డెలివరీ వ్యాను నిండా కావలసినవన్నీ కొనుక్కు వచ్చింది.

విడి భాగాలుగా వచ్చిన సామానంతా కొన్ని గంటల్లోనే నిపుణుల చేతిలో రకరకాల వస్తువులుగా రూపు దిద్దుకున్నాయి. వేటి స్థానంలో అవి చక్కగా అమరిపోయాయి.




ఏమేం తెస్తున్నానో ముందే చెప్తే, అమ్మ వొద్దంటుందని, నాన్నకి మాత్రం చెప్పింది లావణ్య. తెచ్చినవన్నీ చూసిన తర్వాత అమ్మ తప్పకుండా సంతోషిస్తుందని లావణ్య నమ్మకం. చాలా రోజులుగా అనుకొంటోంది, తను సంపాదించిన డబ్బుతో అమ్మా నాన్నలకు మంచి సౌకర్యాలు అమర్చిపెట్టాలనీ, వారి చిన్నచిన్న సరదాలన్నీ తీర్చాలని నిజానికి ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితిలో వాళ్ళు అన్నీ అమర్చుకోవచ్చు. కానీ

బెడ్‌రూమ్‌లో పాతమంచాలూ, అట్ట కట్టిన పరుపుల స్థానంలో, చక్కని నగిషీలు చెక్కిన బర్మాటేకు డబుల్‌కాట్, దానిపై మెత్తని కర్లాన్ పరుపులూ – దిండ్లూ ఆపైన లేత నీలిరంగు పువ్వుల కాటన్ బెడ్ షీట్, మంచానికి సరిపోయే గులాబీరంగు దోమతెర – మంచం ప్రక్కనే చక్కని డిజైన్‌తో వున్న టీపాయ్, దాని పైన బెడ్‌ల్యాంప్, మరో ప్రక్క అవసరాన్ని బట్టి అమరికను మార్చుకునే ఈజీ ఛెయిర్. ఇవన్నీ అమర్చేసరికి బెడ్‌రూమ్ స్వరూపమే మారిపోయింది. ఇక హాల్లో పట్టు పరుపులను తలపించే మెత్తని కుషన్‌లతో మహారాజా సోఫాసెట్టు, నేల మీద కాశ్మీరీ నేత అందాలను నింపుకున్న కార్పెట్, పాత టీవీ స్థానంలో ఎల్‌సీడీ టీవీ, డీవీడీ హోమ్ థియేటర్ సిస్టమ్. ఇవిగాకుండా రకరకాల ఫ్లవర్‌వేజ్‌లు, సహజంగా కనిపించే రంగురంగుల పూలు – పొద్దు పోయేదాకా మనుషుల వెంటే

ఉండి ఒక పద్ధతి ప్రకారం అన్నీ అమర్చింది లావణ్య. శివప్రసాద్ కొంత సౌందర్యదృష్టి, కళాత్మక హృదయం కలిగి ఉన్నవాడయినందున, ఇల్లునీ, గదులనూ కాస్త విశాలంగా డిజైన్ చేయడం వలన లావణ్య తెచ్చిన వస్తువులన్నీ చక్కగా ఒదిగి పోయాయి.

హాల్లో వేలాడదీసిన షాండలియర్, వాటిలోని లైటింగ్ బాగా నచ్చింది సుశీలకు. లోలోపల ఎంతో సంతోషంగా వున్నా, పిల్లదాని సంపాదనంతా దుబారాగా ఖర్చయిపోతోందన్న కోపమూ వుంది. కుదిరితే, ఎంతో ఘనంగా పెళ్ళి చేయాల్సి వుండగా, ఇప్పుడీ అనవసరపు ఖర్చులెందుకని ఆమె వాదన. 'ఏం! ఇన్నాళ్ళూ మేం ఇలానే పడుకోలేదా!' అన్న తల్లి ప్రశ్నకు. 'ఇంకా ఎన్నాళ్ళు ఇలానే పడుకుంటారనే ఇవన్నీను!' అని కూతురి జవాబు! తన పెళ్ళయిపోయిన తర్వాత తన సంపాదనతో అమ్మా నాన్నలకి కావాల్సినవి కొనిచ్చే స్వేచ్ఛ ఉంటుందో లేదో తెలియదు. అందుకే ఈసారి వచ్చేటప్పుడు ఇవన్నీ కొనుక్కు వచ్చింది.

ఆ రోజు రాత్రి లావణ్య చిన్నపిల్లగా మారిపోయి అమ్మ ఒడిలోకి ముడుచుకొని కమ్మగా నిద్రపోయింది. సుశీల కూడా చాలా ఏళ్ళ తర్వాత నిద్రలోని సుఖం చవిచూసింది.

తెల్లవారు ఝాము – తాను చేతులు జోడించి, స్వామి వారి ముందు నిలబడి గొంతెత్తి సుప్రభాతం పాడుతున్నట్లుగా కలగంటోంది సుశీల! కానీ కాసేపటికి అది కలకాదని, పాడేది తానుకాదని, దూరం నుండి వినిపిస్తోందని తెలిసేసరికి, వెంటనే లేచి కూర్చుంది. ప్రక్కన లావణ్య లేదు. హాల్లోంచి హోమ్ థియేటర్ సిస్టమ్‌లో మంద్ర స్థాయిలో, స్పష్టంగా, శ్రావ్యంగా సుప్రభాతం వినిపిస్తోంది. నిజానికి ఇదే సుప్రభాతాన్ని ఇంతకుముందు రేడియోలో ఎప్పుడూ గరగర గురగురల మధ్యనే విని ఉండడం వలన ఇప్పుడు వినిపించేది చాలా మధురంగా వినిపిస్తోంది. సుశీల లేచి హాల్లోకి నడిచింది. పూజ గదిలో నుండి చక్కని అగరువత్తుల వాసన ముక్కుపుటాలకు సోకింది. పూజగదిలో తలస్నానం చేసి, దీపం వెలిగిస్తోన్న లావణ్యను చూసి, మనసులోనే మురిసిపోయింది.

నాన్నగారితో కూర్చుని టీ, బిస్కట్ తీసుకుంటూంటే రాత్రి ఎంత బాగా నిద్ర పట్టిందో, ఒంటినొప్పులు ఎలా మంత్రం వేసినట్లు మాయమయ్యాయో, ఇద్దరూ పోటీపడి లావణ్యతో చెప్తూ వుంటే, మనసులోంచి ఆనందం పొంగుకొచ్చింది లావణ్యకు. ఈ సంతోషమే వాళ్ళలో తను చూడ దలచుకున్నది. సమయం ఏడున్నర. నాన్న రేడియోలో పాత హిందీ పాటలు వినే సమయం. లావణ్య లేచి 'అనార్కలి' లోని 'యే జిందగీ ఉసీకి హై' పాటని డీవీడీలో ప్లే చేసింది.ఆ పాట మునుపటికన్నా కొత్తగా, లతా గొంతులోని చివరి గమకపు మాధుర్యాన్ని సైతం వినిపించింది. శివప్రసాద్ మొహంలో గత కాలపు జ్ఞాపకాలన్నీ ఒక్క మెరుపుతో ప్రత్యక్షమయ్యాయి. తన చిన్నప్పుడు నాన్న ఛాయ్ తాగుతూనో పేపర్ చదువుతూనో, షేవింగ్ చేసుకుంటూనో రేడియోలో వినే పాత హిందీ పాటలన్నీ లావణ్యకు బాగా తెలుసు. మొన్న సిటీలో మ్యూజిక్ షాపులు తిరిగి మరీ తీసుకొంది. తాను తెచ్చిన కలెక్షనంతా నాన్నముందు కుమ్మరించేసింది. అందులో అమ్మకి ఇష్టమైనవీ ఉన్నాయి. ఏదో పెద్ద నిధి దొరికినంత సంబర పడ్డాడు శివప్రసాద్. నిజానికి ఆయన ముందున్న ఆ అమూల్య సంగీత సంపద ఏ నిధికన్నా తక్కువేదేమీ కాదని ఆయనకు తెలుసు కూడాను.

సాయంకాలం అమ్మ పూలు అల్లుతూ, డాబా మీద నాన్నతో కబుర్లు చెప్తున్నప్పుడు మరో అద్భుతమైన కానుకని ఆమెకు బహూకరించి ఆమెను సర్‌ప్రైజ్ చేసింది.

''అమ్మా! ఇది నీ కోసం! కేవలం నీ కోసం!'' అంటూ ఒక రంగురంగుల అట్టపెట్టెను అమ్మ చేతిలో పెట్టింది.

''ఏవండీ! చూస్తున్నారా? నిన్నటి నుండి దీని దుబారా! అదేదో మాంత్రికుడి టోపీలోంచి కుందేళ్ళూ, పావురాలు తీసినట్లు, ఇది పూటకొక్క రంగుల డబ్బా తీస్తున్నది! వణీ! డబ్బులు చెట్టుకు కాస్తున్నాయేమిటే!''

''అది కష్టపడి సంపాదిస్తోంది! తన ప్రియమైన అమ్మకోసం ఏదో తెచ్చింది ప్రేమతో!'' శివప్రసాద్ సమర్థించాడు కూతురుని.

''ముందు విప్పి చూడవే అమ్మా!'' ఊరిస్తోంది లావణ్య.

విప్పిచూస్తే ఆ అట్టపెట్టెలో నుండి బుల్లి డిజిటల్ కెమెరా బయట పడింది. అది చూడగానే సుశీల చాలా ఆశ్చర్యపోయి, తర్వాత ఆనందపడింది. సుశీల మొహం లోని ఆ ఆశ్చర్యానందాలను, క్షణాల్లో అదే కెమెరాతో క్లిక్‌మనిపించి వెంటనే అమ్మకి చూపించింది లావణ్య! 'తన మొహం ఇంత సంభ్రమంగా కూడా మారి పోగలదా?' అని మరింత సిగ్గుపడింది సుశీల.

ప్రకృతి ఆరాధకురాలైన సుశీల, తనకంటూ సొంత కెమెరా వుంటేనా – అని తపనపడిన రోజుల్లో అది అందని ద్రాక్షగా మిగిలిపోయింది. పెళ్ళి అవగానే అందరూ ఆడాళ్ళలాగే సుశీల మనసులో వున్న కలలూ – చేతిలో వున్న కళలూ – మెల్లమెల్లగా మాయమయి పోయాయి. మళ్ళీ ఇన్నాళ్ళకు....!

అసలు తన జీవితంలో తనకంటూ ఒక కెమెరా వస్తుందని ఊహించలేదు. అయితే తన మనసు పొరలలో అట్టడుగున ఎంతో రహస్యంగా దాచుకున్న తీరని కోరికల లిస్టు, ఈ పసి దానికి ఎలా దొరికిందో తనకి అర్థం కావడం లేదు. బెడ్‌రూంలోని నగిషీ మంచం, టీపాయ్, హాల్లోని సోఫాసెట్టు. మల్లీశ్వరి సినిమా పాటలు, చివరికి రంగు రంగుల ఫ్లవర్ వేజ్‌లు – ఇవన్నీ తన ఆ రహస్య లిస్టులో ఉన్నవే!

***

''లైఫ్‌లో మీ ప్రిఫరెన్సెస్ ఏమున్నాయి లావణ్యగారూ!'' శ్రీకాంత్ అడిగాడు. ఈ ప్రశ్న విన్న తర్వాత లావణ్య తన మనసులో వున్నది నిర్మొహమాటంగా ముందే చెప్పేస్తే మంచిది. తను అనుకున్నది చాలా స్పష్టంగా చెప్తానన్న నిర్ణయానికి వచ్చింది. దూరపు బంధువుల ఇంట్లో శ్రీకాంత్ అనే అబ్బాయితో పెళ్ళి చూపులు ఏర్పాటుచేశారు లావణ్యకి. అమ్మాయి, అబ్బాయి ఇద్దరూ సిటీలోనే వుంటారు కాబట్టి, ముందుగా ఒకరినొకరు చూసుకొని ఇష్టపడితే గనక పెద్దలు మాట్లాడుకోవచ్చని, పెద్దగా ఫార్మాలిటీస్ ఏమీ లేకుండా ఈ ఏర్పాటుచేశారు ఇద్దరికీ కావలసిన బంధువులు – ఇంటిముందరి లాన్‌లో కుర్చీలు వేసుకొని, లావణ్యా, శ్రీకాంత్ మాట్లాడుకుంటున్నారు. వారికి ఫ్రీగా ఉంటుందని కావాలనే వారిద్దరిమధ్య ఇంకెవరూ లేకుండా ఏర్పాటుచేశారు.

''ఏం ఆలోచిస్తున్నారు! నేనడిగింది మీ ప్రిఫరెన్సెస్, మీ హాబీస్ వగైరా...''

''నా మొదటి ప్రిఫరెన్స్ మా అమ్మానాన్నలే! వారి తర్వాతే ఎవరైనా! వారిని ముందు ముందు నేనే చూసుకోవాల్సి వుంది!'' స్థిరంగా అంది లావణ్య.


శ్రీకాంత్ లోలోపల నవ్వుకున్నాడు. అమ్మానాన్నలు తప్ప మరో ప్రపంచం తెలీని ఆడపిల్లలు మొదట్లో అలాగే అంటారు. పెళ్ళయి కాస్త ముదిరిన తర్వాత ప్రాధాన్యతలు పూర్తిగా మారిపోయి, తన భర్తా, తన పిల్లలు, తన ఆస్తీ అని గిరిగీసుకొని, ఆ గిరిలోకి మూడవ మనిషి రాకుండా జాగ్రత్త పడతారు. చివరికి తన కన్న తల్లిదండ్రులనైనా ఆ గిరిలోకి రానీయరు. దీనికి తన అక్కయ్యే మంచి ఉదాహరణ అనుకున్నాడు.

''ఒక వేళ మీకు అవకాశం వచ్చి విదేశాలకు వెళ్ళిపోతేనో!''

''వెళ్ళను! ఇంతకుముందు అలాంటి అవకాశాలు చాలా వచ్చాయి కూడాను! ఆ విషయమే మీతో ముందుగా మాట్లాడాలని!''

''చెప్పండి! మీ అభిప్రాయాలు ఏ మాత్రం సంకోచించకుండా చెప్పొచ్చు!''

''శ్రీకాంత్‌గారూ! మాది మధ్య తరగతిలో సాదాసీదా కుటుంబం. ఇప్పుడు అన్నయ్య, నేనూ ఇద్దరం జాబ్ చేస్తున్నాం కాబట్టి ఫరవాలేదు. అంతకు ముందు మా నాన్న గారు చాలా కష్టపడి, మమ్మల్ని చదివించారు. నిజానికి మమ్మల్ని ఇద్దర్నీ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా చూడటానికి వాళ్ళు పడిన కష్టాలు నాకు ఇప్పటికీ జ్ఞాపకం వున్నాయి. జీవితంలో ఎన్నో చిన్న చిన్న సరదాలను కూడా చంపుకొని, పొదుపుగా నెట్టు



కొచ్చి మమ్మల్ని చదివించారు. ఇప్పుడు వారికి వయసుమీద బడుతోంది. ఇంకా ఐదేళ్ళ తర్వాతైనా వారు వేరే వారి మీద ఆధారపడక తప్పదు. మనం ఎంత డబ్బు వాళ్ళకి అరేంజ్ చేసినా, మనం దగ్గరుండి చూసుకున్నంత బయటివాళ్ళు చూసుకోలేరు కదా!''

''నిజానికి మీ తల్లిదండ్రుల బాధ్యత మీ అన్నయ్య చూసుకోవాల్సి వుంది కదా!''

''అంటే మీరనేది తల్లిదండ్రుల బాధ్యత సాధారణంగా కొడుకులు మాత్రమే చూసుకోవాలనా?''

''అంటే ఆడపిల్లని పరాయి ఇంటికి కోడలుగా పంపించిన తర్వాత ఇక వారి బాధ్యత ఇంట్లో వుండే కొడుకులదే అవుతుంది కదా అని నా ఉద్దేశం!''

''మీరనేది కొంత నిజమేకావొచ్చు! కానీ పూర్తి నిజం కాదు. ఎందుకంటే కొడుకనీ కూతుర్నీ ఒక లాగే పెంచి, ఒకలాగే చదివించి, ఒకేలాగ చూసుకున్నప్పుడు, అవసాన దశలో కేవలం కొడుకులనే బాధ్యులుగా చేయడం, కూతుళ్ళు తమకేమీ సంబంధం లేనట్లు, తాము పరాయి ఇంటి వాళ్ళమైనట్లు - తల్లిదండ్రుల బాధ్యత నుండి తప్పుకోవడం సబబుకాదని నా ఉద్దేశం''.

లావణ్య అలా అనగానే స్టేట్స్‌లో వున్న తన అక్కయ్య గుర్తుకొచ్చింది శ్రీకాంత్‌కి. అక్కయ్యకి అమెరికాలో పనిచేస్తోన్న ఇంజనీర్‌తో చాలా ఘనంగా పెళ్ళి జరిపించారు. భర్తతో స్టేట్స్‌కి వెళ్తున్నప్పుడు, అమ్మానాన్నల్ని వదిలి వెళ్తున్నందుకు తెగ బెంగపడిపోయింది. ఆర్నెల్ల వరకు రోజూ ఫోన్ చేసేది. ఆ తర్వాత వారానికి ఓసారి ఫోన్ చేయడం కూడా కష్టమై పోయింది. అమ్మకి ఆపరేషనై చావుబ్రతుకుల మధ్య హాస్పిటల్‌లో వున్నప్పుడు వస్తుందేమోనని అమ్మ రోజూ అక్కయ్యని కలవరించేది. కానీ అక్క మాత్రం 'అన్నీ చూసుకునేందుకు అక్కడ తమ్ముడున్నాడు కదా' అనేసింది! ఆ తర్వాత ప్రెగ్నెన్సీ రాగానే మాత్రం అమ్మ మీద ఎక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చి, తన ప్రక్కన లేకపోతే కుదరదని ఏడిస్తే, కన్నకడుపు ఉండబట్టలేక, ఈ సాకుతోనైనా కూతుర్ని చూసుకోవచ్చని అమ్మ - అమ్మకోసం తప్పనిసరై నాన్న, ఇద్దరూ స్టేట్స్ వెళ్ళారు. డెలివరీ తర్వాత తాను మాత్రం మంచం దిగకుండా వయసుడిగిన వారని కూడా చూడకుండా గొడ్డు చాకిరీ చేయించుకొని ఆర్నెల్ల తర్వాత పంపించేశారు. ఆ తర్వాత రెండేళ్ళకు తన సంపాదనకు అడ్డుగా వుందని పిల్లని తెచ్చి అమ్మానాన్నల వద్ద వదిలేసి వెళ్ళింది. పెద్ద వయసులో అంత చిన్నపిల్లని సాకేందుకు వాళ్ళు పడుతున్న అవస్థలు తాను ప్రత్యక్షంగా చూశాడు.

''కొన్ని విషయాలు ముందుగానే మాట్లాడుకుంటే ముందు ముందు సమస్యలుండవని నా అభిప్రాయాలు మీకు చెప్పాను. మీరూ అంతే క్లారిటీగా వుండాలని అంటున్నాను'' లావణ్య ముక్కుసూటిగా మాట్లాడటం శ్రీకాంత్‌కి బాగా నచ్చింది.

''అంటే మీ పేరెంట్స్ సంరక్షణాభారం మీదేనన్నమాట!'' ఆమె ఆ విషయంలో ఎంత స్థిరంగా వుందో తెలుసుకోడానికి, మరోసారి అడిగాడు శ్రీకాంత్. శ్రీకాంత్ అలా మరోసారి అడగటంతో అతనికి నచ్చినా నచ్చకపోయినా తాను మరింత స్పష్టంగా వుండాలనిపించింది లావణ్యకి. ఆ విషయంలో రాజీపడేందుకు లావణ్య అస్సలు సుముఖంగా లేదు!

''తప్పకుండా నాదే! మా అన్నయ్యా స్టేట్స్‌లో వున్నాడు. ఉద్యోగాన్నీ, సంపాదననీ తల్లిదండ్రుల కోసం వదిలేసి రాలేదు! ఇక మిగిలింది నేనొక్కదాన్నే! నేను కూడా వాళ్ళని వదిలేసి, నా దారి నేను చూసుకుంటే మానవత్వం అనిపించుకుంటుందా శ్రీకాంత్ గారూ! పైసాపైసా పోగేసి మనల్ని ఈ స్థితికి తెచ్చిన వాళ్ళని అవసాన దశలోనైనా మనం చూసుకోవాలి గదా! వాళ్ళు మనకి చేసినదాంట్లో ఏపాటి?''

''పిల్లల కోసం ఆ మాత్రం చేయడం ఎవరికైనా సహజం లావణ్యగారూ!''

''మరి ఇక్కడే వస్తోంది తేడా! పిల్లలకోసం మీరనుకుంటున్న 'ఆ మాత్రం' చేయడం సహజమైనప్పుడు, వారి చేతగాని వయసులో వారి సంరక్షణను చూడటం పిల్లల సహజ గుణం కావాలి గదా! ఇక్కడెందుకు అసహజంగా ప్రవర్తిసున్నారన్నదే నా బాధ!'' లావణ్య చెప్పింది స్పష్టంగా అర్థమయింది శ్రీకాంత్‌కి. ''అంతేకాదు శ్రీకాంత్‌గారూ! సందర్భం వచ్చినందుకు చెప్తున్నాను. ఇప్పుడు చట్టపరంగా తండ్రి ఆస్తిలో, కొడుకులతో సమానంగా వాటా పంచుకుంటున్నప్పుడు, వారి సంరక్షణ బాధ్యతలను కూడా సమానంగా పంచుకోవాలి గదా! ఇంతకు ముందే మీరన్నట్లు బాధ్యతల దగ్గరకొచ్చేసరికి 'పరాయి వాళ్ళయి' పోయినట్లుగా మాట్లాడి, కొడుకుల మీదకు నెట్టేస్తున్నారు. వీరిద్దరి మధ్య తల్లిదండ్రులు బలయిపోవడం సబబు కాదు!'

''బాగా చెప్పారు లావణ్యగారూ! ఏదిఏమైనా తల్లిదండ్రుల బాధ్యత మానవత్వానికి సంబంధించిన విషయం. మానవత్వాన్ని ఏ చట్టమూ నిర్వచించలేదు. ఆస్తిలో సమాన వాటాకి చట్టం ఉన్నట్లుగా, బాధ్యతలకి కూడా చట్టం తెస్తేగాని కుదరదో ఏమో!'' అలా అంటున్నప్పుడు శ్రీకాంత్‌కి తన అక్కయ్య అమ్మతో అన్నమాటలు గుర్తుకొచ్చాయి. తనకు ఆడపిల్ల పుట్టింది గనుక, నాన్నగారి ఆస్తిలో తమ్ముడితో సమానంగా భాగం ఇవ్వాలందట 'భార్యా భర్తలిద్దరూ కోట్లు సంపాదిస్తున్నారు, ఇంకా ఆస్తి నీకెందుకే?' అని అమ్మ అంటే 'హక్కు హక్కే గదా' అందిట! ఆ సమయంలో అక్కయ్యకు బాధ్యతలు గుర్తు రాలేదు.

''నా అభిప్రాయాలను ప్రాధాన్యతలను మీకు స్పష్టంగా చెప్పాననుకుంటున్నారు. మీరు బాగా ఆలోచించుకొని ఒక నిర్ణయానికి రండి! తొందరేమీ లేదు!'' నవ్వుతూ అంది లావణ్య!

''లావణ్యగారూ! మీ అభిప్రాయాలే నాకూ వున్నాయి. మా అమ్మా నాన్నల పట్ల, వారి అవసరాల పట్ల నేనెన్నడూ నిర్లక్ష్యంగా లేను, వుండబోను కూడా! నా ప్రాధాన్యత కూడా ముందు వాళ్ళే! మీలాంటి అమ్మాయి నాకు తోడుగా రాబోతున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది! థాంక్స్ ఎలాట్!'' అంటూ చేయి ముందుకు సాచాడు!

శ్రీకాంత్ నిర్ణయానికి సంతోషపడిన లావణ్య కూడా అతనితో జీవితం పంచుకునేందుకు చేయి ముందుకు సాచింది!

***

''ఆ!ఆ! ఇదే ఇల్లు! రండి! రండి! రండి! ఇక్కడే దించాలి సామాను!'' లావణ్య డెలివరీ వ్యాను డ్రైవర్‌తో అంటోంది!

శ్రీకాంత్, లావణ్యలు దగ్గరుండి మరీ ఇంట్లో అన్ని వస్తువులను పొందిగ్గా సర్దేశారు. చూస్తూ వుండగానే కిచెన్, హాలూ, బెడ్‌రూమ్ పూర్తిగా స్వరూపాల్ని మార్చుకొని ఆ వయో వృద్ధులకి మరింత సౌకర్యవంతంగా మారిపోయాయి. దీనంతటికీ కారణం తమ కోడలు లావణ్యే అని తెలుసుకున్న ఆ దంపతులకు లావణ్య పరాయి ఇంటి నుండి వచ్చిన కోడలుగా గాకుండా తమ కడుపున పుట్టిన కూతురిలా కనిపించింది.

అటు పుట్టినింట్లోనూ, ఇటు మెట్టినింట్లోనూ లావణ్య వచ్చిందంటే, మండుటెండా కాలంలో చల్లని శ్రావణమేఘమొకటి వచ్చి చిరుజల్లును కురిపించినంత సంతోషం వెల్లివిరిస్తుంది! వెళ్ళిపోయిన తర్వాత ఆ జ్ఞాపకాలను పదిలంగా దాచుకొని, ఎంతో ఆర్తితో వాళ్ళు ఎదురుచూస్తూ వుంటారు. ఆ శ్రావణ మేఘం వచ్చి మళ్ళీకురిసేదాకా!

*

చిరునామా:
బి. మురళీధర్
క్వార్టర్ నెం. బి-85, హౌసింగ్ బోర్డు కాలనీ,
ఆదిలాబాద్ - 504 001
సెల్: 94402 29728



## నిన్ను నువ్వు ప్రేమించు...

ఇవి బిపాసా చెబుతున్న డివిడి పాఠాలు. ఇవి ప్రేమ పాఠాలు అనుకుంటే పప్పులో కాలేసినట్టే! ఇవి ఫిట్‌నెస్ పాఠాలు. ఫిట్‌నెస్‌కీ, ప్రేమకి సంబంధం ఏమిటి? అని ఆశ్చర్యపోనక్కర్లేదు. శరీరం మీద ప్రేమ పెరిగితేనే శ్రద్ధ ఎక్కువ అవుతుందన్నది బిపాసా ఉద్దేశం. ఇలా నేరుగా తన ఉద్దేశం చెబితే ఎవరూ డివిడిలు కొనరనుకుందో ఏమో! ఈ విధమైన స్లోగన్‌తో తన డివిడిలను మార్కెట్‌లోకి విడుదల చేసింది. ప్రేమ గురించి బిపాసాకు తెలిసినంతగా, మరొకరికి తెలియదన్న విషయం బాలీవుడ్‌లో అందరికీ తెలిసిందే కావడంతో, ఈ స్లోగన్‌తో మార్కెట్‌లోకి వచ్చిన డివిడిలు హాట్‌కేక్‌ల్లాగా అమ్ముడుపోతున్నాయట! గతంలో శిల్పాశెట్టి ఈ బాటన పయనించి లాభపడిన సంగతి గుర్తుండే ఉంటుంది. కాకపోతే బిపాసా ఫిట్‌నెస్ పాఠాలకన్నా, ప్రేమ పాఠాల డివిడిలు విడుదల చేస్తే మరింత హాట్ హాట్‌గా అమ్ముడుపోయేవని కొందరు అంటున్నారు.